క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి శ్రీకర విల్లాస్ వరకు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

బృందావన్ హిల్స్ ఫీడర్ పరిధిలో

బృందావన్ హిల్స్ ఫీడర్ పరిధిలో నూతన విద్యుత్ పోల్స్ ఎరక్షన్ వర్క్ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బృందావన్ హిల్స్, ప్రశాంత్ హిల్స్, సైదప్ప బస్తీ, రాజధాని స్కూల్, బండారి లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

అధికారుల బదిలీలు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వినయ్‌కుమార్ బాలానగర్ ఎన్నికల అధికారిగా బదిలీ అయ్యారు. గతంలో స్థానికంగా రెండుసార్లు ఇన్‌చార్జ్ తహసీల్దారుగా బాధ్యతలు నిర్వర్తించి ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా తనదైన శైలిలో చర్యలు తీసుకున్నారు. ఆయన స్థానంలో ఘట్‌కేసర్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న అశ్వినికుమార్ రానున్నారు.

- ఇటీవల సస్పెండ్‌కు గురైన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి స్థానంలో కూకట్‌పల్లి నుంచి రజనీకాంత్‌ను నియమించారు. రజనీకాంత్ గతంలో ఇక్కడ వీఆర్వోగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మల్కాజ్‌గిరి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న నవీన్‌కుమార్ కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారిగా రానున్నారు.

గిర్దావర్ శ్రీలక్ష్మి బదిలీ..

దుండిగల్: గండిమైసమ్మ దుండిగల్ మండల గిర్దావర్ శ్రీలక్ష్మి బదిలీపై కాప్రా మండలానికి వెళ్లారు. ఆమె స్థానంలో బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్‌గా పని చేస్తున్న ప్రదీప్‌రెడ్డి రానున్నారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ బదిలీ..

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ జ్యోతి సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మహేశ్వరం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మహేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం సూరారంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకుని అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశమయ్యారు.

బాచుపల్లి ఆర్ఐగా షెర్పల్

నిజాంపేట్: రాష్ట్రం వ్యాప్తంగా చేపట్టిన రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా బాచుపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా షెర్పల్ నియమితులయ్యారు. ఘట్‌కేసర్ మండల ఆర్ఐగా పని చేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేస్తూ మేడ్చల్ జిల్లా ఆర్డీవో మల్లయ్య బుధవారం ఉత్తర్వులు చేశారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన జీఎల్ఎల్ గేటెడ్ కమ్యూనిటీవాసులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని జీఎల్ఎస్ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ప్రభుత్వ విప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించగా శంభీపూర్ రాజు సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకుడు శామీర్‌పేట్ హన్మంతరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

జీడిమెట్ల: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికి అక్కడే మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం .. గాజులరామారం ఆదర్శనగర్‌కు చెందిన మహేశ్వరరెడ్డి జోమాటోలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 9గంటలకు మహేశ్వరరెడ్డి షాపూర్‌నగర్‌లోని సాయిదర్శిని హోటల్‌లో ఫుడ్ తీసుకుని డెలివరీ ఇచ్చేందుకు చింతల్‌వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో మహేశ్వరరెడ్డి హెచ్ఎంటీ బిల్డింగ్ వద్దకు చేరుకోగానే వెనుకనుంచి వచ్చిన బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. మహేశ్వరరెడ్డిపై నుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మీనాక్షి దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాన్వాయ్ ఆగకపాయె.. ఆశ ఆవిరాయె!

బస్సు ఆపకుండానే వెళ్లిపోయిన సీఎం కేసీఆర్ • నిరాశగా వెనుదిరిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు



ఐడీపీఎల్ చౌరస్తాలో సీఎం రాక కోసం కార్యకర్తలతో కలిసి వేచి చూస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మెదక్ పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం కుత్బుల్లాపూర్ మీదుగా వెళ్తుండటంతో స్థానిక నేతల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వివేకానంద ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తా వద్ద స్వాగతం పలికేందుకు కార్యకర్తల సమీకరణ చేపట్టారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యకర్తలు పార్టీకి అనుకూలంగా.. ముఖ్యమంత్రికి మద్దతుగా నినాదాలు చేస్తూ వేచి ఉన్నారు.

కాసేపు షాక్‌లోనే కార్యకర్తలు..

- ఇంతలో ముఖ్యమంత్రి కేసీఆర్ కాన్వాయ్ వచ్చింది. కొద్దిసేపు ఆపి ప్రసంగిస్తారని అందరూ భావించారు. కానీ బస్సు ఆపకుండానే వెళ్లిపోయింది. అసలు ఏమి జరుగుతుందో తెలియక నాయకులు కాసేపు అయోమయానికి గురయ్యారు. వెంటనే షాక్ నుంచి తేరుకుని నిరుత్సాహంగా వెనుదిరిగారు. దీంతో ఎంతో ఆశగా ఎదురు చూసిన గులాబీ శ్రేణులకు నిరాశే మిగిలింది.

హాట్ టాపిక్‌గా కార్పొరేటర్ల విదేశీ పర్యటన..

- తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తే ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. కానీ గత రెండు సంవత్సరాలుగా ఎడమొహం.. పెడమొహంగా ఉంటున్న గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు విదేశీ పర్యటనకు వెళ్లడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.
- మొదటి నుంచి ఎమ్మెల్యే వివేకానంద్‌ను వ్యతిరేకిస్తూ వస్తున్న వీరు పార్టీ అభ్యర్థిని ప్రకటించిన రెండు రోజుల్లోనే విదేశాలకు వెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశమయ్యింది.
- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు ఎమ్మెల్యే టికెట్ వస్తుందని విస్తృత ప్రచారం చేసిన కార్పొరేటరు, కౌన్సిలర్లు పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయంతో కంగు తిన్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థిని ప్రకటించినప్పటికీ దూరం.. దూరంగా ఉంటూ వస్తున్నారు. కనీసం కలిసే ప్రయత్నం కూడా చేయకపోవడం విశేషం. ఏది ఏమైనా వీరి ప్రభావం ఏ మేరకు ఉంటుందనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

3గంటలు వేచి ఉంటే 3నిమిషాలు కేటాయించని సీఎం

- ముఖ్యమంత్రికి స్వాగతం ఏర్పాట్ల కోసం భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్వాగతం పలికేందుకు సుమారు 3గంటల సేపు కార్యకర్తలు రోడ్డు మీద నిలబడ్డారు. కనీసం 3నిమిషాలు కూడా ఆగకుండా సీఎం వెళ్లిపోవడం గమనార్హం. సీఎం సార్... అలా వెళ్లిపోయారేంటని మాట్లాడుకుంటూ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జయహో.. ఇస్రో

చింతల్ త్రివేణి స్కూల్‌లో చంద్రయాన్-3 లాంచింగ్ నమూనాలో విద్యార్థులు



చంద్రయాన్-3 విజయంతో సర్వత్రా హర్షం

కుత్బుల్లాపూర్: ఏ నోట విన్నా చంద్రయాన్-3 ప్రయోగం గురించే మాట్లాడుకోవడం కనిపించింది. బుధవారం చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్‌ను ప్రజలు టీవీలలో ఎంతో ఉత్సుకతతో వీక్షించారు. బుధవారం చింతల్ త్రివేణి స్కూల్‌లో విక్రమ్ ల్యాండర్ దృశ్యాలను విద్యార్థులు వీక్షించారు. జులై 14 చంద్రయాన్-3 లాంచ్ అయిన క్షణం నుంచి ఆగస్టు 23 చంద్రుడిపై సేఫ్ లాండింగ్ అయ్యే వరకు జరిగిన విషయాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల సైన్స్ అధికారి సుబ్బారావు, సీఆర్ఓ వెంకట్‌రావు, సైన్స్ టీచర్లు సతీష్, శ్రావంతి, సరోజ, సౌజన్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌సీఎల్ నార్త్ కాలనీలో సంబురాలు..

కుత్బుల్లాపూర్: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఎస్‌సీఎల్ నార్త్ కాలనీలో పిల్లలు పెద్దలు జాతీయ జెండాలు పట్టుకుని భారత్ మతాకీ జై, ఇస్రో శాస్త్రవేత్తలు జిందాబాద్ అంటూ నినాదలు చేసి కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ నాయకులు శివాజీ రాజు మాట్లాడుతూ.. జాబిల్లి దక్షిణ ధృవంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశంగా భారత్ చరిత్ర సష్టించిందన్నారు. చంద్రయాన్-3 యాత్ర సుమారు మూడు లక్షల 60 వేల పైచిలుకు కిలోమీటర్లు ప్రయాణించి నేడు క్షేమంగా జాబిలిపైకి చేరడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలోనే భారత్ తలెత్తుకునే విధంగా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



జాతీయ జెండాలు పట్టుకుని కేరింతలు కొడుతున్న ఎస్‌సీఎల్ నార్త్‌కాలనీ చిన్నారులు

సీఎం కేసీఆర్ దివ్యాంగుల పాలిట దేవుడు

రంగారెడ్డినగర్: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుపరుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం ఐడీపీఎల్‌లోని వైఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దివ్యాంగులకు పింఛన్లకు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రూ.3,016 ఉన్న పింఛన్‌ను రూ.4,016కు పెంచి సీఎం కేసీఆర్ గొప్ప మనసును చాటుకున్నారని అన్నారు. ఆయన దివ్యాంగుల పాలిట దేవుడని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 లక్షల 11వేల 656 మంది దివ్యాంగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పింఛన్‌లు ప్రతినెలా అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిళ్ల ఉపకమిషనర్లు నాగమణి, మల్లారెడ్డి, ప్రాసెసింగ్ ఆఫీసర్ హరిప్రియ, మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీష్, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

ఐటీఐలో 31లోపు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఒక సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులైన టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రిషన్, ఎలక్ట్రానిక్స్ తదితర ట్రేడులలో చేరేందుకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒకటి, రెండు దశల అడ్మిషన్లు ముగిశాయని, మూడవ దశలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

కాంగ్రెస్‌లో మహిళలకు సముచిత స్థానం

దుండిగల్: మహిళలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలిగా రేణుకా అశోక్‌రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలిగా చల్లా మాధవిగోపాల్‌రెడ్డి ఎన్నికైన విషయం తెలిసిందే. బుధవారం బౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వాళ్లు భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శాలువాలతో సన్మానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని భూపతిరెడ్డి సూచించారు.

పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు



నిజాంపేట్: కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. బుధవారం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని పెద్ద పార్కును బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో కోటి రూపాయల పైచిలుకు నిధులు వెచ్చించినా కాంట్రాక్టర్ కక్కుర్తితో వాకింగ్ ట్రాక్‌కు సరిగా వేయలేదన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడిన తరవాత మూడు విడతల్లో 50 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు.

- ఇప్పటికీ పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్ మాత్రమే ఏర్పాటు చేశారని తెలిపారు. పార్కులో నిర్వహణ కొరవడి చెత్తాచెదారాలతో నిండిపోయిందన్నారు. కనీసం పిల్లలు ఆడుకునే పరిస్థితి లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు అభివృద్ధి కన్నా విహార యాత్రలపై మక్కువ ఎక్కువగా ఉందని ఎద్దేవా చేశారు. పార్కు అభివృద్ధిపై దృష్టిసారించకుంటే పార్కుకు తాళం వేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. 7వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రవియాదవ్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాధవరావు, ఓబీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, పోలీస్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బూత్ కమిటీలే పార్టీకి బలం

మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్‌దత్తాత్రేయ రాణే



సమావేశంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్

జీడిమెట్ల: బీజేపీ నాయకులు బూత్‌ల వారీగా పార్టీని పటిష్టం చేయాలని మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయ రాణే అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో డా.ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో విధాన సభ ప్రవాస యోజన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 129, 130వ డివిజన్ల కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీకి బూత్ కమిటీలే బలమని అన్నారు. ఆ కమిటీలో పార్టీకి విజయాన్ని సాధించి పెడతాయని పేర్కొన్నారు. దేశంలో అభివృద్ధి సాధించాలంటే బీజేపీ ప్రభుత్వమే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచిరెడ్డి, ఎం.ఎస్ వాసు, శంకర్‌రెడ్డి, బావిగడ్డ రవి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధిలో నూతన ఆవిష్కరణలు అవసరం

రాయదుర్గం: జీవనోపాధిలో నూతన ఆవిష్కరణలు అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. సుస్థిర అభివృద్ధిపై అందరూ దృష్టి సారించాలని, జీవనోపాధి, పేదరికనిర్మూలన, అగ్రిటెక్, యువత పురోభివృద్ధి అవసరమని కూడా వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో నాల్గవ ఎడిషన్ సమావేశాన్ని నడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'చర్చా-23' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సెర్ప్ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అభయ్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మహీంద్రాగ్రూప్ హెచ్ఆర్‌ప్రెసిడెంట్ రుజ్‌టిహ్‌ఇరానీ, ప్రశమ్ సీఈఓ డాక్టర్ రుక్మిణీబెనర్జీ, సీఓఆర్ఎస్ సీఈఓ, వ్యవస్థాపకులు సాయిరీచాహల్, వరల్డ్ బ్యాంక్ సీనియర్ ఎకనామిస్ట్ త్రాయనభట్టాచార్య, వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అభివృద్ధిలో మహిళలు, యువతను భాగస్వాములను చేయాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఎంతో మార్పు సాధ్యమని అభిప్రాయపడ్డారు. అనంతరం వ్యవసాయరంగంలో కూడా చాలా మార్పులు రావాల్సిన అవసరం ఉందని సమావేశంలో పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ప్రజలు బీఆర్ఎస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తారు

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
- రాజ్యాంగం హక్కులను కాలరాస్తున్నారని వ్యాఖ్య

జీడిమెట్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ జిల్లా పర్యటనకు కుత్బుల్లాపూర్ నర్సాపూర్ రోడ్డు మీదుగా వెళ్తుండగా పోలీసులు కుత్బుల్లాపూర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. జీడిమెట్ల, బాచుపల్లి, దుండిగల్, సూరారం పోలీస్‌స్టేషన్‌లలో రెండు పార్టీల నాయకులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. వారు ఠాణాల వద్ద మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రాజ్యాంగం కల్పించిన హక్కును సైతం సీఎం కేసీఆర్ కాలరాస్తున్నారని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు.

- 175 రోజులుగా జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు పరిశ్రమ యాజమాన్యం తమకు న్యాయం చేయాలంటూ పరిశ్రమ ఎదుట కార్మికులు దీక్ష చేస్తున్నారు. సీఎం కేసీఆర్ వారి దీక్షా శిబిరం ముందు నుంచి మెదక్ వెళ్తున్నట్లు తెలుసుకున్న కార్మికులు సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల సీఐ పవన్ కార్మికులను ముందస్తు అరెస్టు చేసేందుకు వెళ్లారు.
- ఈ విషయం తెలుసుకున్న కూన శ్రీశైలంగౌడ్ దీక్షా శిబిరం వద్దకు వెళ్లి కార్మికులకు తన మద్దతు తెలిపారు. దీంతో పోలీసులు శ్రీశైలంగౌడ్‌తో పాటు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి బాచుపల్లి స్టేషన్‌కు తరలించారు. బాచుపల్లి ఠాణాలో శ్రీశైలంగౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వానికి పోయేకాలం వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసి చిత్తుచిత్తుగా ఓడిస్తారన్నారు. కేసీఆర్ కుటుంబం త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు.



సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు మద్దతు తెలుపుతున్న శ్రీశైలంగౌడ్



శ్రీశైలంగౌడ్‌ను అదుపులోకి తీసుకుని బాచుపల్లి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



దుండిగల్ ఠాణాలో బీజేపీ నాయకులు

బీఆర్ఎస్ అభివృద్ధి చేస్తే అరెస్టులు ఎందుకు?

తెలంగాణలో ఎంతో అభివృద్ధి చేసిందని గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వం ముందస్తు అరెస్టులు ఎందుకు చేస్తోందని ఎస్ఎఫ్ఐ స్టేట్ ప్రధాన కార్యదర్శి గొల్లజాన్ అన్నారు. తెలంగాణలో బాగుపడింది కేవలం కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రమేనని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్‌కు ఓటమి తప్పదన్నారు.



జీడిమెట్ల స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు

బరిలో దిగేందుకు.. దరఖాస్తు చేసుకుంటూ..

సుభాష్‌నగర్: రానున్న ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో దిగేందుకు ఆశావహుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. బుధవారం నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సొంటిరెడ్డి పున్నారెడ్డి, కందాడి జ్యోత్స్నారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బండి శ్యామ్‌గౌడ్ వేర్వేరుగా గాంధీభవన్‌కు వెళ్లి అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని దరఖాస్తు చేసుకున్నారు.



గాంధీభవన్ ఆవరణలో దరఖాస్తుతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి





దరఖాస్తును అందజేస్తున్న బండి శ్యామ్‌గౌడ్, జ్యోత్స్నారెడ్డి